

హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు ఎదురుగా రహదారిపై నిలిపిన భారీ వాహనాలు



మల్కాపురం కేంద్రీయ విద్యాలయం గేటు ఎదురుగా రోడ్డుపై భారీ వాహనాలు

రోడ్లపై భారీ వాహనాలు తిష్ట!

- కొరవడిన పార్కింగ్ స్థలాలు
- రోజుల తరబడి రోడ్లపైనే భారీ వాహనాలు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

సింధియా: మల్కాపురం నుంచి సింధియా వెళ్లే ప్రధాన రహదారిలో ప్రయాణమంటే ద్విచక్ర వాహనదారులు హడలెత్తిపోయే పరిస్థితి నెలకొంది. గాజువాక నుంచి శ్రీహరిపురం, మల్కాపురం మీదుగా సింధియా వెళ్లే రోడ్డులో నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అయితే శ్రీహరిపురంలో కోరమాండల్ ఫెర్టిలైజర్స్, మల్కాపురంలో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ వంటి భారీ పరిశ్రమలకు నిత్యం మన రాష్ట్రంలో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆయా పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలకు ఆ సంస్థలు పార్కింగ్ స్థలాలు కేటాయించకపోవడంతో ఆ వాహనాలన్నీ రోడ్డుపై పార్కింగ్ చేసి రోజులు తరబడి ఉంచేస్తున్నారు. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోని యాజమాన్యాలు

పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలకు పార్కింగ్ స్థలం కేటాయించాల్సిన బాధ్యత పరిశ్రమలపై యాజమాన్యాలపై ఉన్నా వారు పట్టించుకోవడం లేదు. దీంతో లోడింగ్ కోసం వచ్చిన భారీ వాహనాలు రోజుల తరబడి రోడ్డుపైనే పార్కింగ్ చేసి ఉంచుతున్నారు. పోలీసు అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది.

రాకపోకలకు ఇబ్బంది

పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలను రోజులు తరబడి రోడ్డుపైనే నిలుపుతున్నారు. సంబంధిత వాహనాదారులు రోడ్ల మీదే స్నానపానలు, వంటావార్పు వంటి దైనందిన కార్యకలాపాలు చేసుకోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడుతున్నారు. వాహనాల సిబ్బంది డివైడర్లపై కునుకు తీస్తుండడంతో మరింత ఇబ్బందిగా తయారైంది.

నిత్యం ప్రమాదాలు

ఈ మార్గంలో వీధి దీపాలు సైతం సరిగ్గా వెలగడం లేదు.



మల్కాపురం-సింధియా ప్రధాన రహదారిపై నరికి వదిలేసిన చెట్ల కొమ్మలు

దీంతో అటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు నిత్యం రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. చీకట్లో ప్రయాణిస్తూ రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలను ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. అయితే రోడ్డుపై పార్కింగ్ చేసిన భారీ వాహనాలకు ఎప్పటికప్పుడు జరిమానాలు విధిస్తున్నా వాహనదారుల్లో మార్పు రావడంలేదని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. పరిశ్రమల యాజమాన్యంతో సంప్రదింపులు జరిపిన పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని సూచించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

నరికేసిన చెట్ల కొమ్మలు రోడ్డుపైనే...

భారీ వాహనాలతో ఒక పక్క ప్రయాణికులు ఇబ్బందులు పడుతుంటే మరో పక్క చెట్ల కొమ్మలను నరికివేసి అలాగే వదిలేయడంతో అవస్థలు పడుతున్నారు. ఆ కొమ్మల ఆకులు ఎండి గాలికి ఎగిరి వాహనాల్లో ఇరుక్కొని ప్రమాదాలు జరుగుతున్నాయి. మరో వైపు మల్కాపురం పోలీస్‌స్టేషన్‌కు ఇరువైపులా దుకాణాలు వెలిశాయి. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు సైతం వాహనాలు ఎక్కడో వదిలి స్టేషన్‌కు కాలినడకన రావాల్సిన పరిస్థితి ఉంది.



కొమ్మలు నరికేయడంతో మోడుగా మిగిలిన చెట్టు

అడ్డుకట్ట వేయాలి



ప్రధాన రహదారిపై భారీ వాహనాలు పార్కింగ్ చేయకుండా నిరోధించాలి. రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణమంటే భయపడి వెళ్లకుండానే ఆగిపోతున్నాం. వీధిలైట్లు సైతం వెలగడం లేదు. భారీ వాహనాలు నిలిపి ఉంచడంతో రాత్రి వేళ గుర్తించలేక ప్రమాదాలు జరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. జీవీఎంసీ, రహదారిభద్రత, ట్రాఫిక్ పోలీస్ అధికారులు కూడా పట్టనట్టుగా వ్యవహరించడం సరికాదు.

–నక్కా సూర్యనారాయణ, ప్రయాణికుడు

తరచూ అవస్థలు



మల్కాపురం, సింధియా మార్గంలో భారీ పరిశ్రమలు ఉన్నాయి. వీటికి వచ్చే వాహనాలను రహదారిపై రోజుల తరబడి పార్కింగ్ చేసి ఉంచేస్తున్నారు. దీంతో సాధారణ వాహనాల రాకపోకలకు తరచూ ఇబ్బందిగా ఉంది. ట్రాఫిక్ సమస్య తలెత్తడమే కాకుండా చుట్టుపక్కల ఉంటున్న వారికి సైతం సమస్యగా మారుతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

–సూరాడ పెంటారావు, మల్కాపురం

క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి హారతి ఇస్తున్న పూజారమ్మ విజయమ్మ

కంచరపాలెం : జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఉదయం నుంచి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈవో సురేష్‌బాబా భక్తుల సౌకర్యాలకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎండకు భక్తులు ఇబ్బంది పడకుండా మౌలిక వసతులు కల్పించారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పనులు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో గణపతి పూజలు



కుంచమ్మకాలనీలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న నాయకులు

మల్కాపురం: వినాయక నవరాత్రి పూజల్లో భాగంగా 58వ వార్డు కుంచమ్మకాలనీలో గణనాథునికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే గణబాబు కుమారుడు మౌర్యసింహ పాల్గొని పూజలు చేసి అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీను,పోతాబత్తుల శ్రీను,మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

- 60వ వార్డు శ్రీహరిపురం లక్ష్మీగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో సుమారు 2 వేల మందికి అన్నప్రసాదాలు స్వీకరించారు.
- 61వ వార్డు మల్కాపురం యాదవవీధి వద్ద స్థానిక యాదవ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. సాయంత్రం గణనాథుడిని మల్కాపురం పుర వీధుల్లో అంగ రంగ వైభవంగా ఊరేగించారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తదితరులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి సెయింట్ పీటర్ ప్రధాన దేవాలయ పీపీసీ సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం వరద బాధితలకు విరాళాలు సేకరించారు. ఈ మేరకు సెయింట్ పీటర్స్ విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ విరాళాల సేకరణ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తు, ధన రూపంలో విరాళాలు సేకరించి ఖమ్మం, కృష్ణ, గుంటూరు ప్రాంతాల వరద బాధితులకు అందించనున్నామని తెలిపారు. అనంతరం కొండవీధి, స్లీప్‌గుర్తువీధి, దయాస్‌వీధి, గెడ్డవీధి, పార్క్‌వీధి, పోస్టాఫీస్ వీధి, మాన్యువల్ స్ట్రీట్ ప్రాంతాల్లో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో ఫాదర్లు అంథోనీ రాజ్, వినయ్, పీపీసీ సభ్యులు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సమావేశం రసాభాస



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు



రోడ్డుపై గొడవపడుతున్న కొందరు సభ్యులు

గోపాలపట్నం: మర్రిపాలెం వుడా లే అవుట్ వరసిద్ధి వినాయక ఆలయంపై దేవదాయ శాఖ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం ఆలయ కమిటీ సర్వసభ్య సమావేశాన్ని కమిటీ సభ్యులు నిర్వహించారు. సమావేశంలో ప్రత్యేకంగా దేవదాయ శాఖ, విజిలెన్స్ అధికారులకు అందిన ఫిర్యాదులపై చర్చించారు. ఆలయాన్ని కాపాడుకునేందుకు ఏవిధమైన చర్యలు తీసుకోవాలన్న అంశాలను గాలికి వదిలేసి.. ఫిర్యాదుదారుడిపై ఏ చర్యలు తీసుకోవాలన్న అంశాలపై పలువురు సభ్యులు మాట్లాడడంతో వివాదం రేగింది. మరి కొందరు సభ్యులు వివాదం సద్దుమణిగేలా కమిటీ సభ్యులు ప్రయత్నించాలని.. అందుకు తామంతా సహకరిస్తామని తెలిపారు. సమావేశం అయిన తర్వాత కొందరు సభ్యులు రోడ్డుపైకి వచ్చి గొడవ పడ్డారు. మాటామాటా పెరగడంతో తోపులాటకు దారితీసింది. కాలనీ వాసులు కలుగజేసుకుని వివాదం సద్దుమణిగేలా చేశారు. సమావేశానికి అసలు ఫిర్యాదు దారుడే హాజరు కాలేదని చెప్పుకుంటూ సభ్యులంతా వెళ్లిపోయారు.

ఘనంగా గణపతి అనుపోత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, తదితరులు



అనుపోత్సవంలో ఆకట్టుకున్న రథాలు

గోపాలపట్నం: శాంతినగర్ యూత్ ఆధ్వర్యంలో వినాయకుడి అనుపు మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. స్థానికులు ఈ వాహనాల వద్ద ఫొటోలు దిగారు.

రోడ్డుపైకి మురుగు నీరు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు



మురుగు నీటి ప్రవాహంతో ఇబ్బందులు పడుతున్న పాదచారులు

గోపాలపట్నం: మర్రిపాలెం వుడాలేఅవుట్ కొత్త పార్కు వద్ద మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి కాల్వ కొంత భాగం వేయక పోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే బాగు చేయాలని కోరుతున్నారు.

రోడ్డు ఇలా.. రాకపోకలెలా?



నాచు పట్టిన రహదారి

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులపేటలో రైల్వే వంతెన ప్రాంతంలో 'గణబాబు మార్గ్' నాచు పట్టి అధ్వానంగా మారింది. కంచరపాలెం నేతాజీ కూడలి నుంచి గవర కంచరపాలెం, ఆర్పీపేట, పైడిమాంబకాలనీ, దయానందనగర్, చాకలిగెడ్డ, రాజీవ్‌కాలనీ, ముత్యమాంబకాలనీ ప్రాంతాల వారికి రైల్వే గేటు సమస్య నుంచి విముక్తి కోసం పాదాచారుల వంతెన నిర్మించారు. అండర్ ఫుట్‌పాత్ మార్గం ఏర్పాటు చేసినా రహదారి అధ్వానంగా ఉండడంతో అటుగా ప్రయాణించే ఆయా కాలనీల పాదచారులు నరక యాతన పడుతున్నారు. అండర్ రహదారి నాచు పట్టి, రాళ్లు తేలి ప్రమాదభరితంగా మారిందని వాపోతున్నారు. నడిచేందుకు సక్రమంగా లేకపోవడంతో రైల్వే ట్రాక్ మార్గాన్నే వినియోగిస్తున్నామని పలువురు చెబుతున్నారు. దీనికి తోడు శానిటరీ సిబ్బంది రహదారిని శుభ్రం చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అండర్‌పాత్ వంతెన రహదారికి మోక్షం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



రాళ్లు తేలి మురుగు ప్రవహిస్తున్న అండర్ పాత్‌వే

అంధకారంలో జనతాకాలనీ



62వ వార్డు జనతాకాలనీలో వెలగని వీధిలైటు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు జనతాకాలనీలో వీధిలైట్లు వెలగకపోవడంతో చీకట్లో సంచరించలేక అనేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. చీకటి పడితే తేళ్లు, జెర్రిలు, పాములు వంటి విషకీటకాలు సంచారం అధికంగా ఉంటుందని, దీంతో వీధుల్లో ప్రయాణించాలంటే భయమేస్తుందని ఆవేదన చెందుతున్నారు. వీటితో పాటు వీధి కుక్కలు గాయపరుస్తున్నాయని చెబుతున్నారు. పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు త్వరితగతిన స్పందించి వీధి లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ



అపహరించిన బైక్ ఇదే

మల్కాపురం: ఇంటి ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని దొంగలు చోరీ చేశాడు. వాహనదారుడు క్రైం పోలీసులను ఆశ్రయించాడు.వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీహరిపురం సమీపంలోని ఎంఐజీ కాలనీలో జి.సోమేశ్వరరావు నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి తన విధులు ముగించుకుని వచ్చిన తర్వాత ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్కు చేశాడు. తెల్లవారి విధులకు వెళ్లేందుకు రాగా వాహనం కనిపించకపోవడంతో లబోదిబోమన్నాడు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఎంవిజీ కాలనీ పరిధిలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

రుణ పరిమితి పెంపు.. వడ్డీ తగ్గింపు

గాజువాక: బీహెచ్‌ఈఎల్–హెచ్‌పీవీపీ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ సభ్యులకు రుణ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచుతూ ఆదివారం నిర్వహించిన సొసైటీ మహాజనసభలో తీర్మానం చేశారు. రుణాలపై వడ్డీ రేటును కూడా 13 నుంచి 12 శాతానికి తగ్గించారు. రూ.5.48 కోట్ల టర్నోవర్ కలిగిన సంఘంలో 386 మంది సభ్యులున్నారని, ఈ ఏడాది రూ.2,19,550 ఆదాయం లభించిందని సొసైటీ కార్యదర్శి మండ వెంకటరాజు నివేదికలో పేర్కొన్నారు. సంఘం బైలాలో నంబర్ 4, 18, 19, 41(ఎ)లను సవరిస్తున్నట్టు పేర్కొన్నారు. సొసైటీ అధ్యక్షుడు కె.రామునాయుడు మాట్లాడుతూ సంఘ పురోభివృద్ధి కోసం పాలకవర్గానికి ప్రతి సభ్యుడు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా 2024–25 వార్షిక బడ్జెట్‌కు సభ్యులు ఆమోదం తెలిపారు.

భారీ అన్నసమారాధన



62వ వార్డులో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింధియా: వినాయక మహోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో వీఎస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని దానాలు చేసిన కలగని సంతృప్తి కేవలం అన్నదానం చేసినప్పుడు మాత్రమే వస్తుందన్నారు. గణపతి నవరాత్రి మహోత్సవాల్లో ఉత్సవ కమిటీలు అనవసర ఖర్చులు చేయకుండా పేదల కడుపు నింపే అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ ఆదారి నాగరాజు, ప్రెసిడెంట్ ఎస్‌కే మీరా, వైస్ ప్రెసిడెంట్ వి.గణేష్, ఇతర ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

గోపాలపట్నం : మర్రిపాలెం పార్వతినగర్‌కు చెందిన చెరకం విజయలక్ష్మి (63) అదృశ్యమైందని కేసు నమోదైంది. ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కుమార్తె సాగరిక వద్ద నివసిస్తున్న ఆమె ఈ నెల 18న సింహాచలం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు జైలు రోడ్డులో నివసిస్తున్న కొడుకు ఇంటి వద్ద ఉన్నట్లుగా సాగరికకు ఫోన్ ద్వారా సమాచారం అందడంతో అక్కడికి వెళ్లగా... అప్పటికే అక్కడి నుంచి తిరిగి మర్రిపాలెం బయలుదేరిందని తెలియడంతో తిరిగి వచ్చారు. మర్రిపాలెంలోని ఇంటికీ రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.